కథావేదిక

# తేడా

-డా.తంగిరాల మీరా సుబ్రహ్మణ్యం

"పండుగ దగ్గరకొస్తోందిగా పిన్నీ కొత్త చీరె కొనుక్కున్నారా?" సాయంకాలం ఆఫీసునుంచి వస్తూ తన గుర్రాన్ని (మోపెడ్‌ని) మా ఇంటి ముందు ఆపేసి లోపలికి రాగానే అడిగింది అనూహ్యా.

"ముందు కూర్చుని ఈ మంచినీళ్ళు త్రాగు" చల్లని నీళ్ళు అందించి ఫ్యాన్ వేసి తనూ ఎదురుగా ఉన్న సోఫాలో కూర్చుంది సౌభాగ్య.

"నీ షాపింగ్ అయిపోయిందేమిటి? ఏంకొన్నావ్?" కుతూహలంగా అడిగింది తనే మళ్లీ.

"ఎక్కడ పిన్నీ ఖాళీ దొరికితేకదా! ఈ శని వారం సెలవులు. ఆరోజైనా వెళ్దామని. అతివలను ఉర్రూతలూగించే చేనేత సంబరాలు అంటూ టీవీలో ప్రకటనలు అదరగొట్టేస్తున్నారుగా. ఇరవై శాతం రాయితీ ఉందిట. అదీకాక ప్రభుత్వ ఉద్యోగులకైతే వాయిదాల మీద చెల్లించే సౌలభ్యం కూడా ఉంది కదా. మార్చిలోనే ఎండలు చూస్తే మండిపోతున్నాయి. నూలుచీరలు తప్ప మరొకటి కట్టుకోలేకపోతున్నాం. ఈ వంకన ఒక నాలుగు చీరెలు కొనుక్కుందామని. ఇంతకీ మీరు నాతో వస్తారా?" ఊపిరి తీసుకోకుండా మాట్లాడింది అనూహ్యా. సౌభాగ్య నవ్వింది.

"కొంచెం నిదానం తల్లీ! ఎందుకంత జెట్‌స్పీడ్‌లో అదరగొడతావు నన్ను? నేనూ నేతచీరలు రెండు కొనుక్కోవాలనుకుంటున్నాను. నువ్వెప్పుడు వెడదామంటే అప్పుడు సిద్ధంగా ఉంటాను. అక్కడే మీ బాబాయిగారికి కూడా పంచెల జత కొనేస్తే సరిపోతుంది" అందావిడ.

"అయితే రేపు శనివారం ఉదయం పదింటికల్లా బయల్దేరుదాం పిన్నీ. సాయంకాలం అయితే చల్లగా ఉంటుంది అనకూడదు. ఆ టైంలో విపరీతమైన రద్దీ ఉంటుంది. పండుగసీజన్ కదా" అంటూ బయల్దేరింది అనూహ్యా. అనుకున్నట్టుగానే శనివారం ప్రొద్దున్న తొందరగా వంటపని ముగించి ఇద్దరూ షాపింగ్‌కని బయల్దేరారు.

"ముందు కల్యాణ మంటపంలో పెట్టిన ఎగ్జిబిషన్‌కి వెళ్లి చూద్దాం పిన్నీ" అంటూ అటు దారితీసింది.

"రాష్ట్రం నలుమూలల నుండీ ఎంపికచేసి తెచ్చిన చేనేత వస్త్రప్రదర్శనను దర్శించి కనులు మిరుమిట్లుగొలిపే వేలాది చీరెలతో మీ మనసును దోచే చీరెను కొనండి అంటూ కరప్రతాలు పంచి మరీ ప్రచారం చేశారు ఆ చేనేతవస్త్రాల ప్రదర్శన గురించి" మేడ మెట్లెక్కుతూ ఆయాసపడుతూనే చెబుతోంది అనూహ్యా.

"అన్నిటికీ హడావుడి చేయడం అనూహ్యా స్వభావం. పనులు చేయడంలోనూ కంగారే. మాట్లాడ్డంలోనూ తొందరే" నవ్వుతున్న సౌభాగ్య "వచ్చేశాంగా తినబోతూ రుచులెందుకు అడగడం? చూద్దాం పద!?" అంటూ అనూహ్యా వెంటే మెట్లెక్కింది. గద్వాల, వెంకటగిరి, గుంటూరు చీరెల కోసం ప్రత్యేకంగా అడిగింది అనూహ్యా.

వాళ్ళు చూపించిన చీరెలు పెద్ద గొప్పగా అనిపించలేదు. కాస్త పాతబడి మడతల దగ్గర నలిగినట్టు ఉన్నాయి.

"వీళ్లిచ్చే ప్రకటనలనకూ ఇక్కడి ప్రదర్శనలో ఉన్న వాటికి సంబంధం ఉన్నట్టు లేదు పిన్నీ" గొంతు తగ్గించి అన్నది అనూహ్యా.

"ఇక్కడెందుకు కాలయాపన? వెడదాం పద" అని బయటకు దారితీసింది సౌభాగ్య.

టాప్‌కో చేనేత వస్త్రాల షాపునకు వెళ్లారు.

"ఏంకావాలండీ?" షాపులో ఉన్న స్త్రీ నీరసంగా నిరాసక్తంగా అడిగింది.

"గద్వాల చీరెలు, వెంకటగిరి చీరెలు చూపించండి. కొత్తరకాలు ఏవన్నీ వచ్చాయా?" ఈసారి సౌభాగ్య అడిగింది.

"కొత్తవి ఏం రాలేదండి" అంటూ పెద్ద జరీ అంచున్న గద్వాల చీరెలు రెండు, జరీ గీతలున్న వెంకటగిరి చీరెలు రెండు బీరువాలోంచి తీసి కౌంటర్ మీద పడేసింది.

"ఎంత పడతాయి రిబేటు పోను?" అనడిగింది సౌభాగ్య.

"పద్దెనిమిది వందల చిల్లరదాకా అవుతుంది. ఈ జరీ గడి ఉండేవి రెండువేలు" అన్నదావిడ వీధిలోకి చూస్తూ.

"కొంచెం తక్కువలో చూపించండి. జరీ ఎక్కువగా ఉండేవి వద్దు" అంది అనూహ్యా.

"ఎంతలో కావాలి మీకు?" కాస్త అసహనంగా అడిగిందావిడ.

"వెయ్యిరూపాయల లోపు ఉండాలి. బార్డర్ చిన్నదిగా ఉన్నా ఫర్వాలేదు" సౌభాగ్య చెప్పింది.

"ఆ ఖరీదులో ఎక్కువ లేవు. అదిగో అరలో ఉన్న వాటిలో మీకేదైనా నచ్చితే చెప్పండి తీసి చూపిస్తాను" ఆవులిస్తూ చెప్పిందావిడ.

"ఇది చిన్నషాపు అనూ. మనం గాంధీస్ట్రీట్‌లో ఉన్న మెయిన్‌బ్రాంచ్‌కి వెడదాం పద... వెరైటీ కూడా ఎక్కువగా ఉంటుంది" నెమ్మదిగా సలహా చెప్పింది సౌభాగ్య.

"నిజమే మేడమ్. అక్కడకు వెళ్లండి. మీకు కావలసిన రకాలు దొరుకుతాయి" కౌంటర్ మీద పెట్టిన నాలుగుచీరెలూ అరలో సర్దేస్తూ అన్నది కౌంటరమ్మ వాళ్లని పంపించేస్తే చాలునన్నట్టు.

సౌభాగ్య, అనూహ్యా గాంధీ స్ట్రీట్ దారిపట్టారు. షాపు విశాలంగా ఉంది. బట్టలు కూడా చాలానే ఉన్నాయి. కానీ వీళ్ళు అడిగిన చీరెలు చూపించడంలో ఎంతమాత్రం ఉత్సాహం లేకుండా మరబొమ్మల్లా నాలుగురకాలు అక్కడ పడేసి ఇక మీ ఇష్టం అన్నట్టు వాళ్ల ముఖంకేసి చూస్తూ నిలబడ్డాడు వీళ్లకు చూపిస్తున్నతను.

ఖరీదులు చూస్తే ప్రైవేట్ షాపులో చెప్పే ధరల కంటే ఎక్కువగా ఉన్నట్టే అనిపించింది ఇద్దరికీ.

"పోనీ కంచి కాటన్ చీరెలుగానీ పోచంపల్లి కాటన్ గానీ ఉన్నాయా?" ఆశ చావక అడిగింది అనూహ్యా.

"నాలుగురోజులు పోయాక వస్తే కొత్తస్టాక్ వస్తే రావొచ్చునండీ" ఇప్పటికి తప్పించుకుంటే చాలు అన్నట్టు చెప్పాడు అతను.

"ఇక ఇంటికి పోదాం పద తల్లీ. ఎండ ఎక్కువైపోయింది. చెమటలు పోసేస్తున్నాయి" అలసటగా అంది సౌభాగ్య.

"ఇంత దూరం వచ్చాం కద పిన్నీ దగ్గరలోనే వందన, కళాసాగర్ ఉన్నాయి చూసి వెళ్లిపోదాం" నచ్చ బలికింది అనూహ్యా.

"సరే పద" అంటూ పక్క వీధిలో ఉన్న వందనకు వెళ్లారు. షాపులోపలికి అడుగుపెడుతుండగానే ఎసిషాప్ కావడాన చల్లని వాతావరణం వాళ్లని సేదతీర్చింది.

"నమస్కారమమ్మా! చాలారోజులకు వచ్చారు. ఏం చీరలు చూపమంటారు?" చాలా ఆత్మీయంగా పలకరించాడు గుమ్మం దగ్గర నిలబడిన వ్యక్తి.

"సమ్మర్ అంటే నూలు చీరెలే కదండీ. గద్వాల, వెంకటగిరి లాంటివి..." ముందుకు అడుగులేస్తూ అంది అనూహ్యా.

"ఇటు రండమ్మా. కొత్తస్టాక్ నిన్ననే వచ్చింది.

పోచంపల్లి డిజైన్లు కూడా కాటన్ చీరెలు వచ్చాయమ్మా. ఉప్పాడ చీరెలు ఈరోజే పార్శిల్ విప్పాం'' అంటూ వాళ్ళు కూర్చోడానికి రెండు కుర్చీలు దగ్గరగా జరిపాడు.

“మేడమ్‌గారికి కావలసినవి చూపించు. నిన్న కొత్తగా వచ్చినవన్నీ బయటకు తీయి'' అంటూ కౌంటర్‌లో ఉన్న సేల్స్‌మాన్‌కు చెప్పి వెళ్లిపోయాడు. అతను ఒక్కోరకంలో ఇరవై చీరలకు తక్కువకాకుండా తీసి వాళ్ల ముందు పరిచాడు.

“ఇది చూడండమ్మా. ఆకుపచ్చని చీరెకు పింకుబార్డర్ ఎంత నప్పిందో. ఈ కొంగు చూడండి. లేతరంగులు కావాలంటే ఈ నీలం రంగు చీరె చూడండి. మీరు మంచి తెలుపు గనుక మీకు ఏరంగైనా నప్పుతుంది'' అంటూ ఒక్కొక్క చీరె మడతలు తీసి కొంగు, బార్డర్ అందం కనబడేట్టు తన మీద వేసుకుని చూపించసాగాడు.

ఒక గంటసేపు అన్నిరకాలు, రంగులు, డిజైన్లు చూశాక అనూహ్య రెండు, సౌభాగ్య ఒకటి సెలెక్ట్‌చేసుకున్నారు.

“అదేంటమ్మా మీరు ఒక్కటే తీసుకున్నారు. వీటిలో నచ్చకపోతే వేరేరకాలు చూపిస్తాను. మళ్లీ ఇటువంటి వెరైటీ మీకు దొరకదమ్మా. కొత్తస్టాక్ మీకేముందు చూపెడుతున్నాం'' అంటూ ఇంకో ఇరవై చీరెలు తీసి ఆవిడ చేత మరొక చీర ఎంపిక చేయించాడు.

“ఇక చాలండీ... మా బడ్జెట్ అయిపోయింది'' అంది అనూహ్య నవ్వుతూ.

“ఊరుకోండమ్మా. ఉద్యోగస్తులు మీకు బడ్జెట్ ఏమిటి? కట్టిన రకం కట్టకూడదు మీరు. ఇవి చూడండి. నా మాట విని ఇందులో ఒకటి తీసుకోండి. మీ ఆఫీసులో మీ స్నేహితురాళ్లందరూ ఎక్కడ కొన్నావని అడగకపోతే నన్నడగండి. ఖరీదు కూడా పెద్ద ఎక్కువేం కాదు'' అంటూ అనూహ్యతో మరో రెండుచీరెలు తీయించాడు.

తామనుకున్న దానికన్నా ఎక్కువే బిల్లు పెడుతున్నామనిపించినా నచ్చినవి ఎంపికచేసుకున్నామని ఇద్దరికీ తృప్తిగా, సంతోషంగా ఉంది.

“ఒక్క నిముషం కూర్చోండమ్మా. మ్యాచింగ్ జాకెట్ బట్టలు ఇక్కడికే తెప్పిస్తాను'' అంటూ ఆ చీరెలు పట్టుకెళ్లి వాటికి సరిపోయే రవిక బట్టల తానులు తీసుకువచ్చి దేనిమీదకు ఏ రంగు బాగుంటుందో చెప్పి ఆ చీరెల మీద పెట్టి చూపించాడు. ఈలోపుగా చిన్న డిస్పోజబుల్ కప్స్‌లో టీ తీసుకువచ్చి ఇచ్చాడొక కుర్రాడు.

“అన్నట్టు మనం మీ బాబాయిగారి పంచెలు చూద్దామనుకున్నాం టాప్‌కోలో. మరిచిపోయాం'' అంటూ నొచ్చుకుంది సౌభాగ్య.

“రేపు వెళ్దాంలే పిన్నీ'' అన్న అనూహ్య నాలుక కరుచుకుని “రేపు ఆదివారం. ఆ షాపులు తెరవరు. పోనీ ఇవాళ సాయంత్రం వద్దామంటే ఎనిమిదిగంటలకే మూసేస్తారు'' అంది.

వీళ్ల సంభాషణ వింటున్న ఆ కౌంటర్‌లోని సేల్స్‌మాన్ “ఎందుకమ్మా..మా షాపులో ఉన్న వెరైటీ పంచెలు మరెక్కడా ఉండవమ్మా. మీకు కావాలంటే ఇప్పుడే తీసుకువెళ్లవచ్చు. లేదు రేపు వస్తామంటారా రేపు మా షాపు తెరిచే ఉంటుంది'' అన్నాడు. అనూహ్య వాళ్లాయనకి ఫ్యాంట్, షర్ట్, సౌభాగ్య భర్తకు పంచెల జత కూడా కొనేశాక తనే వెళ్లి బిల్లు వేయించుకుని వచ్చాడతను.

డబ్బు కట్టేసి చీరెల ప్యాకెట్లు పట్టుకుని బయట గుమ్మం దగ్గరకు రాగానే ఆ ప్యాకెట్స్‌ని షాపు పేరు ముద్రించి ఉన్న జ్యూట్ బ్యాగ్‌లో పెట్టి వాళ్లకందిస్తూ “ఇంకో రెండ్రోజుల్లో మళ్ళీ కొత్తస్టాక్ చీరెలు వస్తాయమ్మా. వచ్చి చూడండి. మీలాంటి వారు కొంటేనే కదా మా వ్యాపారం జరిగేది'' అని సగౌరవంగా చెప్పాడు అక్కడున్న మరొక వ్యక్తి.

“అలాగేనండీ'' అంటూ బయటకు వచ్చారు సౌభాగ్య, అనూహ్య.

“వీళ్ళేమో కస్టమర్లని దేవుళ్ళుగా చూస్తారు. మళ్లీ ఇక్కడికే వచ్చేలా చేస్తారు. ఆ షాపువాళ్ళు చూడు మీరు కొంటే మాకేమిటి మానితే మాకేంటి మా జీతం మాకొస్తుంది అన్నట్టు ఎంత నిరాసక్తంగా మాట్లాడి పంపించారో'' అంది అనూహ్య.

“ప్రైవేట్‌రంగానికి లాభాలు, ప్రభుత్వరంగానికి నష్టాలు వస్తున్నాయంటే అందుకే మరి. బ్యాంక్‌లు, స్కూళ్ళు, కాలేజీలు, షాప్‌లు, కంపెనీలు అన్నిట్లోనూ కస్టమర్ సర్వీసులో ఈ తేడాకొట్టొచ్చినట్టు కనబడుతుంది'' అంటూ నిట్టూర్చింది సౌభాగ్య.

★

